# 76. వికట నారాయణ

వెంకట నారాయణ అని, మా చిన్నన్నయ్య క్లాస్‌మేట్ ఒకాయన ఉన్నాడు. అతనికి మాటల విరుపుతో అర్థ విపరిణామం సాధించి ఆ ప్రక్రియ ద్వారా హాస్యం ఉత్పత్తి చేసే సరదా ఉంది. ఈ సంగతి నాకు మొదటిసారిగా నా పెళ్లి సందర్భంగా అతనికి ఇన్విటేషన్ కార్డు పంపినప్పుడు అతను పంపిన గ్రీటింగు ద్వారా తెలిసింది.

"హార్టీ కంగ్రాచులేషన్స్" అనగా హృదయ పూర్వక అభినందనలు - అని ఆ గ్రీటింగ్ కార్డు ద్వారా అర్థం చేసుకోమని వెంకటనారాయణ ఉద్దేశం. మామూలుగా ఇంగ్లీషు అక్షరాలలో "హార్టీ" అనే మాట రాయకుండా తను దానికి చిన్న ట్రిక్కు చేసేడు. బొమ్మల డిక్షనరీలోదో, లేక ఫిజియాలజీ టెక్స్ట్‌బుక్‌లోదో తెలీదు గాని "హృదయం" బొమ్మ ఒకటి కాపీ చేసి, ఆయా భాగాల్లో ఆయా రంగులు పూసి; ఆ బొమ్మ పక్కని ఇంగ్లీషులో "వై" అనే అక్షరం, తెలుగులో "పూర్వక" అనే అక్షరాలూ రాసేడు. వెరశి "హార్టీ", "హృదయ పూర్వక" అయింది. పెళ్లికొచ్చిన వాళ్లలో ఆ కార్డు చూసిన వాళ్లు కొందరేమో బాగానే తయారు చేసేడన్నారు. కొందరు "ఏమిటో, బుర్ర తిరుగుడు బుద్ధులు!" అన్నారు.

వెంకట నారాయణ మా డిపార్టుమెంటులో డైరెక్టరేట్‌లో పనిచేసేవాడు. ఒకసారి బెజవాడలో ఏదో డిపార్టుమెంటల్ కాన్ఫరెన్సు పెడితే అతను హైదరాబాదు నుండీ నేను విజయనగరం నుండీ బెజవాడొచ్చి కలుసుకున్నాం. ఆ రోజుల్లో రమణారెడ్డీ, సంధ్యా కామెడీ జంటగా ఒక తెలుగు సినిమా ఒచ్చింది. ఆ సినిమాకి సంబంధించిన కటౌటు ఒకటి దూరం నుంచి చూపించి "చూడు గోపాలా, పద్దెనిమిది అనే అంకె ఎంతబాగా పెయింట్ చేసేరో!" అని నన్ను ఫూల్ చేసేడు. నేను అది మింగేసి ఊరుకోకుండా "నువ్వు ఐ. సుబ్బారావు గార్ని వెంటనే కన్సల్టు చెయ్యాలి" అని చెప్పేను. "ఆయనెవరయ్యోయి?" అని అతనుఅడగ్గానే - "ఐ"; అంటే కన్ను. ఐ. సుబ్బారావు గారు కళ్ల డాక్టరు" అని చెప్పగానే దెబ్బ తినేశాడు. "నా చెప్పుతో నన్నే కొట్టేవే?" అనడం అయితే అన్నాడు గాని వారం తిరక్కుండా మళ్లీ నా మీద ఒక జోకు ప్రయోగించాడు; నాకు రాసిన ఒక ఉత్తరం ద్వారా.

ఉత్తరం పెద్దగా ఏంలేదు. "క్షేమంగా చేరేను; నువ్వు కూడా ఎక్కడా బ్రేకు జర్నీలు చేసి కాలో చెయ్యో మైండో బ్రేకు చేసుకోకుండా "విజినారం" చేరేవనుకుంటాను. 'నువ్వోలందుకు పోస్తే నేనో అందుకు తాగే' నన్నట్టుగా మన డిపార్టుమెంటు కాన్ఫరెన్సు పుణ్యమా అని మనం రెండు రోజులపాటు గృహాలనే స్వర్గసీమలకి దూరంగా గడిపేం -" ఇలా నడిచింది. (మధ్యలో ఓ చోట "పెళ్లంటే నూరేళ్లమంట" అని ఇరికించాడు; దాని మాట కాదు చెప్పడం.) ఆ ఉత్తరం మీద అడ్రసు ఎలా రాసేడని! నా పేరు రాసి; కిందని ఒక "తలకాయ" బొమ్మవేసి దాని పక్కని సర్వేయర్ అని రాసేడు. "హెడ్ సర్వేయర్" అని దాని భావం, ఆ ఉత్తరం నాకిచ్చిన పోస్టుమాన్, "ఇదేటి బాబూ, తమ రెడ్రస్ ఇలా రాసినారు?" అని అమాయక రిమార్కుతో ఇచ్చేడు. నేను ఉత్తరం టేబులు మీద పెట్టి ఉంచిన సమయంలో నా సీటు కొచ్చిన మా హెడ్ గుమస్తా దాన్ని చూసి నవ్వుకొని "ఈ వెంకట నారాయణ కెక్కడ దొరుకుతాయో ఇలాటి ఐడియాలు!" అన్నాడు.

"ఏం నీక్కూడా తలకాయ ఒకటి వేసి క్లర్క్ అని పక్కని రాసేడా?" అని అడిగాడు.

"అలా చేస్తే గొప్పేముంది? చూడు!" అని మా అప్పలరాజు తనకి వెంకట నారాయణ రాసిన ఒక కార్డు చూపించేడు. అంతకి పదిహేను రోజుల ముందు మా అప్పలరాజు చెవిలో ఏదో ఇన్‌ఫెక్షన్ వస్తే ఆ కారణంగా చెముడు రావచ్చుననీ, వెంటనే మద్రాసు వెళ్లి స్పెషలిస్టు చేత చికిత్స చేయించుకోమనీ మా విజయనగరం డాక్టరు చెప్పేరు. దాంతో అప్పలరాజు సెలవు పెట్టి మద్రాసు వెళ్లి చిన్నపాటి ఆపరేషన్ చేయించుకుని వచ్చాడు. అప్పలరాజు సెలవు గ్రాంట్ అయిందని డైరెక్టరేట్ నుంచి ప్రయివేటు లెటరు రాస్తూ; " విష్ యు ఎ హేపీ న్యూ ఇయర్" అని రాసేడు వెంకట నారాయణ. "ఇయర్" అనే ఇంగ్లీషు మాట 'YEAR' అని కాక 'EAR' అని రాసి పక్కనే ఒక చెవి బొమ్మ వేసేడు.

నేను నరసారావు పేటలో పనిచేసిన నాలుగేళ్ల కాలంలో కోలవెన్ను రామకోటీశ్వరరావు గారి వీధి వరండాలో గడిపిన సాయంకాలాలు చిరకాలం గుర్తుంచుకోదగినవి. 1964లోనేను ఆ వూరికి ట్రాన్స్‌ఫరైనప్పుడు ఆయన అక్కడున్నారని చెప్పింది అక్కిరాజు రమాపతిరావు గారే అయినప్పటికీ; 1965 ప్రారంభ దినాల్లో గంధం యాజ్ఞవల్క్య శర్మగారు తీసికెళ్లేదాకా నేను ఆయన దర్శనం చెయ్యనేలేక పోయాను. స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తుల్నీ వృత్తుల్నీ త్యాగం చేసిన మహాపురుషుల్లో; ఉత్తమ సాహిత్యపు విలువల్ని పరిరక్షించడం కోసం నష్టాలు తెచ్చే పత్రికల్ని నడిపిన స్థితప్రజ్ఞుల్లో; శీల ప్రవృత్తుల ఔన్నత్యం కాపాడుకోడానికి మనోవాక్కర్మల సంయమం పాటించిన యోగుల్లో ఒకరుగా పేర్కొన దగినవారు రామకోటీశ్వరరావుగారు.

అప్పటికి రామకోటీశ్వరరావుగారికి తిరుగులేని నేత్రరుగ్మత. కళ్లు కనిపించకపోయినా ఆయన "త్రివేణి" (ఆంగ్ల-త్రైమాసిక) పత్రికను నడుపుతూనే ఉన్నారు. వారి వీధి వరండాలో కూర్చుని ప్రతి సాయంకాలం "హిందూ" పేపరు వారికి చదివి వినిపించే మహాభాగ్యం కోసం తొందరగా ఆఫీసు నుంచి బయటపడాలని, మా డిప్యూటీ కలెక్టర్ రామచంద్రన్ గారితో ఎన్నెన్ని అబద్ధాలు చెప్పేనో!

1967 లో వెంకట నారాయణ నరసారావు పేట ఆర్.డి.ఓ. ఆఫీసు ఇన్‌స్పెక్షన్ బ్యాచితో కేంపు వచ్చాడు. సాయంకాలం నేను యథాప్రకారం రామకోటీశ్వరరావుగారి ఇంటికి వెళ్తూ ఉంటే ఎదురుగా ఉన్న ఆర్.డి.ఓ. ఆఫీసు వరండాలోంచి నన్ను చూసి పరుగెత్తు కొచ్చేడు వెంకటనారాయణ. పలకరింపులూ అవీ అయ్యేక వెంకటనారాయణ ఆ ఇంటి గేటు కోసం కట్టిన పిల్లరు కి ఉన్న చలువరాతి పలకమీది అక్షరాలు చదివేడు "త్రివేణి".

"ఓహో, త్రివేణి ఆఫీసు ఇక్కడేనన్నమాట. నీకువీళ్లు బాగా పరిచయమా?" అన్నాడు వెంకట నారాయణ.

"అవును" అని గర్వంగా చెప్పేను.

"ఐతైనూ, రేపు సాయంకాలం నేను హైదరాబాదుకి బయల్దేరుతున్నాను గానీ, యాభైగ్రాముల పొట్లాలు ఒక డజను నాకు కన్సెషన్ రేట్‌లో ఇప్పిస్తావా?"

"ఛీ!" అన్నాను.

త్రివేణి - అంటే విదేశీయులు కూడా సాధించలేని విలువలు గల సాహిత్య పత్రిక అని తెలిసి కూడా అదేదో వక్కపొడి అని భావించినట్టు జోకువేసిన వెంకట నారాయణని నేను ఎన్నటికీ క్షమించలేను. ★